షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక


సంపుటి : 1 సంచిక : 301 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 17 సెప్టెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 300 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 16 September 2024 PAGES : 8 PRICE : 5/-




## కిరణ్ కుమార్ రెడ్డికే

# కమలం పగ్గాలు



- భవిష్యత్ రాజకీయాలకు పక్కా స్కెచ్ వేస్తోంది బీజేపీ
- రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలంటే రెడ్డిల మద్దతు అవసరమని భావిస్తున్న కాషాయదళం?
- మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని రంగంలోకి దింపాలని చూస్తోందని టాక్

విజయవాడ

ఏపీ ప్రభుత్వ భాగస్వామి బీజేపీ? భవిష్యత్ రాజకీయాలకు పక్కా స్కెచ్ వేస్తోంది. రాష్ట్రంలో బలపడాలని ఆశిస్తున్న కమలనాథులు? కీలకమైన రెడ్డి సామాజికవర్గంపై ఫోకస్ చేశారంటున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర వేయాలంటే రెడ్డిల మద్దతు అవసరమని భావిస్తున్న కాషాయదళం? మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిని రంగంలోకి దింపాలని చూస్తోందని టాక్ వినిపిస్తోంది. రాయలసీమకు చెందిన కిరణ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి.రాష్ట్ర విభజన తర్వాత పదేళ్ల పాటు రాజకీయాలకు కాస్త దూరంగా వ్యవహరిస్తూ వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి? పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీలోకి ఎంట్రీ ఇచ్చారు. రాజంపేట నుంచి లోక్‌సభకు పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఒకవేళ ఆయన గెలిస్తే కేంద్ర మంత్రి అయ్యేవారని? కానీ, ఫలితం వేరేలా వచ్చినందున ఆయన సేవలను పార్టీకి వాడుకోవాలని - మిగతా3లో



## కేరళలో నిపా కలకలం

- మరోసారి మాస్క్ తప్పనిసరి..!
- వైరస్‌ని అదుపులో చేసేందుకు అధికారులు ముందుజాగ్రత్త చర్యలు
- నిపా వైరస్ జంతువుల నుంచి మనుషులకు సోకుతుంది.

## ఒకేరోజు 13,326 గ్రామసభలతో

# ప్రపంచ రికార్డుకెక్కిన ఏపీ

- ఆగస్టు 23న 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు
- గ్రామసభలో పాల్గొని దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబుకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు
- స్వపరిపాలన ఆకాంక్ష ప్రయాణంలో కొత్త మైలురాయి ఆనందంగా ఉందన్న జనసేనాని




విజయవాడ.

హైదరాబాద్‌లోని పవన్ నివాసంలో ధృవపత్రాన్ని అందజేసిన వరల్డ్ రికార్డ్స్ యూనియన్ ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 23న రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 చోట్ల గ్రామ సభలు నిర్వహించి కూటమి ప్రభుత్వం ప్రపంచ రికార్డుకెక్కింది. దీన్ని వరల్డ్ రికార్డ్స్ యూనియన్ గుర్తించింది. సంబంధిత అధికారులు రికార్డు ధృవపత్రాన్ని తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అందజేశారు. పంచాయతీ రాజ్ మంత్రిగా జనసేనాని బాధ్యతలు చేపట్టిన 100 రోజుల్లోనే ఈ ప్రపంచ రికార్డు నమోదు కావడం గమనార్హం. ఈ సందర్భంగా గ్రామసభలో పాల్గొని దిశానిర్దేశం చేసిన - మిగతా3లో




## ప్రధాని మోదీని కలవడం

# సంతోషం కలిగించింది

- గుజరాత్ లోని గాంధీ నగర్ లో ప్రపంచ పునరుత్పాదక ఇంధన సదస్సు
- హాజరైన ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు
- ఇంధన రంగానికి అనుకూల వ్యూహాలు అవసరమన్న చంద్రబాబు

విజయవాడ.

గుజరాత్ లోని గాంధీ నగర్ లో ఇవాళ 4వ గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హాజరయ్యారు. దీనిపై చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. గుజరాత్ లో ఇవాళ ప్రపంచ పునరుత్పాదక ఇంధన - మిగతా3లో



## సీఎం మమతా బెనర్జీ ఆఖరి ప్రయత్నం సఫలం

- చర్చలకు వైద్యుల అంగీకారం
- సీఎం మమతా బెనర్జీ 5వ ప్రయత్నంలో చర్చలకు సమ్మతం తెలిపిన వైద్యులు
- పూర్తిగా వీడియోగ్రఫీ చేయాలని డిమాండ్
- సీఎస్ పంపిన మెయిల్‌కు స్పందించిన వెస్ట్ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్



## ఎక్కడ చదివావో ఏమో...

- జగన్ ట్వీట్ కు నారా లోకేశ్ కౌంటర్
- విద్యావ్యవస్థను తిరోగమనంలో తీసుకెళుతున్నారన్న జగన్
- చంద్రబాబు, లోకేశ్ లను విమర్శిస్తూ ట్వీట్
- నువ్వు విద్యాశాఖపై లెక్చర్ ఇవ్వడం వింతగా ఉంది అంటూ లోకేశ్ రిప్లయ్

విజయవాడ.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను తిరోగమనంలో తీసుకెళుతున్నారంటూ సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లపై వైసీపీ అధ్యక్షుడు జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు చేయడం తెలిసిందే. దీనిపై నారా లోకేశ్ ఘాటుగా స్పందించారు. ఏం చదివావో తెలియదు, ఎక్కడ చదివావో తెలియదు... నువ్వు విద్యాశాఖ - మిగతా3లో

## మీవి తిరోగమన నిర్ణయాలు...

# మళ్లీ మొదటికే తీసుకెళుతున్నారు



- చంద్రబాబు, లోకేశ్ లపై జగన్ విమర్శనాస్త్రాలు
- విద్యాసంస్కరణలను తుంగలో తొక్కుతున్నారని విమర్శలు
- ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారంటూ ట్వీట్


విజయవాడ.

వైసీపీ అధ్యక్షుడు జగన్ తాజాగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రభుత్వ స్కూళ్లలో సీబీఎస్ఈ విధానం రద్దుతో మీరు మరోసారి పేదల వ్యతిరేకి అని నిరూపించుకున్నారని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా మీరు, విద్యాశాఖ మంత్రిగా మీ కుమారుడు తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వ స్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళుతున్నారని విమర్శించారు. మీ ఇళ్లలో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లల విషయంలో వివక్ష ఎందుకని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిగా మీ 14 ఏళ్ల కాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిందని జగన్ పేర్కొన్నారు. నాడు-నేడు, ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీ, టోఫెల్, సబ్జెక్ట్ టీచర్ల కాన్సెప్ట్, 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు, విద్యాకానుక, రోజుకొక మెనూతో గోరుముద్ద... ఇలా వైసీపీ ప్రభుత్వం అనేక పథకాలు తీసుకువచ్చిందని వివరించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాలను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారని జగన్ ఆరోపించారు. మీ పార్టీ నేతలకు చెందిన ప్రైవేటు స్కూళ్లు బాగుండాలి, ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం అయిపోవాలి... ఇదేగా మీ ఉద్దేశం! అంటూ విమర్శించారు. - మిగతా3లో

# కిరణ్ కుమార్ రెడ్డికే కమలం పగ్గాలు

-మొదటిపేజీ తరువాయి

చూస్తున్నారని చెబుతున్నారు.ప్రస్తుతం ఏపీ బీజేపీ చీఫ్‌గా ఉన్న పురందేశ్వరి స్థానంలో కిరణ్‌కుమార్‌రెడ్డికి ఏపీ బీజేపీ చీఫ్ బాధ్యతలు అప్పగించాలని కలమనాథులు ప్లాన్ చేస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పురందేశ్వరి పదవీకాలం త్వరలో పూర్తికానుండటం? ప్రస్తుతం ఆమె ఎంపీగా ఉండటం వల్ల ప్రత్యామ్నాయంగా కిరణ్‌కుమార్‌రెడ్డికి అవకాశమివ్వాలని చూస్తున్నారని అంటున్నారు. పైగా కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత సామాజికవర్గాన్ని ఆకట్టుకోవాలని ఇప్పటికే ప్లాన్ చేస్తున్న బీజేపీ? కిరణ్‌కు ఇష్టం లేకపోయినా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలనే పట్టుదల ప్రదర్శిస్తున్నట్లు చెబుతున్నారు.ఏపీ రాజకీయాల్లో కులాల ప్రభావం ఎక్కువ. ఒక్కో సామాజికవర్గం ఒక్కో పార్టీతో ర్యాలీ అవుతుంటుంది. కమ్మ సామాజికవర్గం టీడీపీతోను, కాపులు జనసేనతోను, రెడ్డిలు వైసీపీకి మద్దతుగా ఉంటారనే ప్రచారం ఉంది. ఐతే గత ఎన్నికల్లో రెడ్డి సామాజికవర్గం అసంతృప్తితో వైసీపీకి దూరం జరిగిందని విశ్లేషణలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీకి వెన్నుదన్నుగా నిలిచిన రెడ్డి సామాజికవర్గం? 2024లో దూరం జరగడం వల్ల ఆ సామాజికవర్గం ప్రభావం ఎక్కువగా ఉండే రాయలసీమలో



వైసీపీ ఘోరంగా దెబ్బతిన్నదని అంటున్నారు.రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 50కి పైగా నియోజకవర్గాలు ఉండగా, కేవలం ఏడు చోట్లే వైసీపీ గెలిచింది. దీంతో రెడ్డిల్లో అసంతృప్తిని క్యాష్ చేసుకోవాలని చూస్తున్న బీజేపీ?. కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించాలని చూస్తోందంటున్నారు. రెడ్డి సామాజికవర్గం బీజేపీతో చేతులు కలిపితే.. భవిష్యత్‌లో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగొచ్చని బీజేపీ వ్యూహంగా చెబుతున్నారు.ఇక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే బీజేపీకి రెడ్డి సామాజికవర్గం నాయకత్వం వహించేది. రాష్ట్ర విభజన తర్వాత బీజేపీకి నలుగురు నేతలు రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేస్తే అందులో ఇద్దరు కాపు, ఇద్దరు కమ్మ సామాజికవర్గ నేతలు? దీంతో ఈ సారి రెడ్డి సామాజికవర్గం నేతలకు అవకాశం ఇవ్వాలని బీజేపీ అగ్ర నాయకత్వం ఆలోచిస్తోందంటున్నారు. అదేసమయంలో ఇప్పటివరకు అధ్యక్షులుగా పనిచేసిన వారంతా కోస్తా ప్రాంతానికి చెందిన నేతలే? ఈ పరిస్థితుల్లో ఇటు సామాజిక న్యాయం, అటు ప్రాంతీయ సమీకరణలతో రాయలసీమకు చెందిన రెడ్డి నేతను బీజేపీ అధ్యక్షుడిని చేయాలని ప్లాన్ చేస్తోందంటున్నారు.ఆ వర్గంలో బలమైన నేతగా ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి అయితే తమ వ్యూహం ఫలిస్తుందని బీజేపీ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రస్తుత బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సేవలను ఏ విధంగా వాడుకోవాలనే అంశంపైనా బీజేపీ దృష్టిపెట్టిందంటున్నారు. పురందేశ్వరి నాయకత్వంలో టీడీపీతో పొత్తు కుదరడంతోపాటు 8 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాల్లో గెలవడాన్ని చాలా ప్రాధాన్యంగా తీసుకుంది పార్టీ. ఆమెను రాష్ట్ర పార్టీ చీఫ్‌గా తప్పిస్తే మరో కీలక బాధ్యత అప్పగించొచ్చని అంటున్నారు. మొత్తానికి రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలనే ఆలోచనతో బీజేపీ పెద్ద స్కెచ్చే వేస్తోందంటున్నారు.

# బోట్ల తీసివేతకు మరో ప్లానింగ్

**విజయవాడ :** ప్రకాశం బ్యారేజీ వద్ద బోట్ల తొలగింపు ప్రక్రియ క్లిష్టంగా మారింది. దాదాపు 7 రోజులుగా వాటిని తొలగించేందుకు సిబ్బంది చేస్తోన్న ప్రయత్నాలు సత్ఫలాన్నివ్వడం లేదు. బ్యారేజీ గేట్లకు అడ్డంగా చిక్కుకున్న భారీ ఇనుప బోట్లను తొలగించేందుకు నిపుణులతో కూడిన బృందం నిరంతరం శ్రమిస్తోంది. ఈ క్రమంలో బెకెమ్ ఇన్‌ఫ్రా సంస్థ ఇంజినీర్లు మరో ప్లాన్ అమలు చేస్తున్నారు. రెండు భారీ పడవలను ఇనుప గడ్డర్లతో అనుసంధానించి వెలికి తీయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను సైతం ప్రారంభించారు. కాగా, 3 రోజుల క్రితం కాకినాడ నుంచి నిపుణుల బృందం రంగంలోకి దిగి.. గేట్ల వద్ద చిక్కుకున్న 3 బోట్లను నీటిలో నుంచే ఎగువకు తీసుకెళ్లాలని భావించినా వీలు కాలేదు. దుర్గాఘాట్ వైపు పొక్లెయిన్లు పెట్టి భారీ ఇనుప రోప్స్‌తో లాగేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో అధికారులు, నిపుణులు బోట్ల వెలికితీతకు మరో ప్లాన్ అమలుకు సిద్ధమయ్యారు. ఒక్కొక్కటి 50 టన్నుల సామర్థ్యం గల రెండు బోట్లను తెప్పించి వాటిని ఇనుప గడ్డర్లతో అనుసంధానించారు. క్రేన్ల సాయంతో వాటిని బయటకు తీయాలని ప్రయత్నం చేస్తున్నారు. మరి ఇది సత్ఫలితాన్నిస్తుందో లేదో చూడాల్సి ఉంది.ఈ నెల 2న ప్రకాశం బ్యారేజీకి వరద ఉధ్ధృతి వచ్చిన క్రమంలో 4 బోట్లు కొట్టుకొచ్చి బ్యారేజీ గేట్లను ఢీకొన్నాయి. దీంతో 67, 68, 69 గేట్ల వద్ద కౌంటర్ వెయిట్లు దెబ్బతిన్నాయి. దీంతో మరమ్మతులు చేపట్టిన ఇంజినీరింగ్ నిపుణులు.. రిటైర్డ్ ఇంజినీర్ కన్నయ్యనాయుడు ఆధ్వర్యంలో 5 రోజుల్లోపే కౌంటర్ వెయిట్లు ఏర్పాటు చేశారు. అయితే, బోట్లు తొలగించే ప్రక్రియ మాత్రం కొలిక్కి రాలేదు. తొలుత బోట్లను కోసి వాటిని భాగాలుగా చేసి ఒడ్డుకు చేర్చాలని భావించారు. అయితే, అది సాధ్యం కాలేదు. గత 6 రోజులుగా ఎన్ని



ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో భారీ పడవలు, క్రేన్ల సాయంతో వాటిని ఒడ్డుకు చేర్చేలా ప్రణాళిక రచిస్తున్నారు.

అయితే, వరదల సమయంలో బ్యారేజీని బోట్లు ఢీకొనడం వెనుక కుట్రకోణం ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ సందర్భంగా పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. డ్యాంను ఢీకొన్న బోట్లు వైసీపీ నేతలు, కార్యకర్తలవేనని నిర్ధారించారు. వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. ౦ఖ-ఎ౦-ఓ-౼ా౼-0022, ౦ఖ-ఎ౦-ఓ-౼ా౼-0023, ౦ఖ-ఎ౦-ఓ-౼ా౼-0017 నెంబర్లున్న బోట్లతో పాటు ప్రకాశం బ్యారేజీని మరో రెండు బోట్లు ఢీకొన్నట్లు చెప్పారు. ఆ బోట్లు ఉషాద్రి, కర్రి నరహింహా స్వామి, గూడూరు నాగమల్లీశ్వరిలకు చెందినవిగా గుర్తించారు. సాధారణంగా మూడింటిని కలిపి కట్టరని.. వాటికి ఇనుప చైన్ల లంగరు వేయకుండా ప్లాస్టిక్ తాళ్లతో కట్టేసినట్లు పేర్కొన్నారు. తమ బోట్లతో పాటు సమీపంలోని మరో రెండింటిని కూడా కొట్టుకెళ్లేలా కుట్ర చేశారని నివేదికలో వెల్లడించారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుగుతోంది.

# బెజవాడలో బురద రాజకీయాలు

**విజయవాడ :** విజయవాడ వరదల సందర్భంగా ఏపీ రాజకీయాలు బాగా వేడెక్కాయి. అయితే గత 15 రోజుల్లో ఏపీ పాలిటిక్స్ లో పరిణామాలు గమనించిన వారికి కొన్ని విషయాలు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. యాదృచ్ఛికమో లేక పక్కా ప్లానింగో చెప్పలేం కానీ కూటమి ప్రభుత్వానికి కొన్ని ప్లస్ లు గత పక్షం రోజుల్లో ఎదురైతే స్ట్రాటజీ లోపంతో వైసీపీకి కొన్ని అంశాలు మైనస్ గా మారాయి.విజయవాడ లోని సగభాగం మునిగింది అని తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు తన మకాం విజయవాడ కలెక్టరేట్ లోనే ఏర్పాటు చేసుకుని 10 రోజులు అక్కడినుండే వార్ రూమ్ నడిపించారు. 70 ఏళ్లు దాటినా, ఈ వయసులో సైతం వరద నీటిలో, బోట్లలో తిరుగుతూ నీటిలో చిక్కుకుపోయిన బాధితులకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. అలాగే చాలా ఏరియాల్లో మంచి నీరు, పాలు సహా నిత్యావసరాలను సరఫరా చేశారు. విపక్షాలు ఇదంతా ప్రచార ఆర్భాటం అని ప్రచారం చేసినా టీడీపీ సోషల్ మీడియా అతి చేస్తోంది అన్న విమర్శలు వచ్చినా జనాల్లో మాత్రం చంద్రబాబు ఇమేజ్ బాగా పెరిగింది. అడ్మినిస్ట్రేషన్ పరంగా ఆయనకున్న గుడ్ నేమ్ ను మరోసారి నిలబెట్టుకున్నారన్న పేరు ఏపీ అంతటా వచ్చిందిప్రజలు ఒక విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్న సమయంలో వారు తమను ఎవరు సహాయం చేస్తారా అని ఎదురు చూస్తారు తప్పించి రాజకీయాల గురించి అసలు పట్టించుకోరు. వైసీపీ ఈ విషయాన్ని ఎందుకో సరిగ్గా గమనించలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిగో వరదలు ముగిసిన ప్రస్తుత సమయంలో ఆరోపణలు విమర్శలు ఎన్ని చేసినా చెల్లుతాయి. కానీ సరిగ్గా వరదల్లో ఇబ్బంది పడుతున్న సమయం లో "ఈ వరదలు చంద్రబాబు వైఫల్యం వల్లే వచ్చాయి ఆయన తన ఇంటిని కాపాడుకోవడానికి వరదలను విజయవాడ వైపు మళ్లించారు" అనే ఆరోపణలు జనంలోకి పెద్దగా వెళ్లినట్లు కనిపించడం లేదు. ఒకవైపు వరదల వార్తలు నడుస్తుండగానే సత్యవేడు ఎమ్మెల్యే కొనేటి ఆదిమూలం రాసలీలలు అంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆయన తనను చాలా రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు అంటూ పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు మీడియా ముందుకు రావడం రాజకీయంగా సంచలనం గా మారింది.



అయితే ఈ వార్త బయటకు వచ్చిన వెంటనే చంద్రబాబు సత్యవేడు ఎమ్మెల్యేను టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు. ఉదయం వీడియో బయటకు వస్తే మధ్యాహ్నానికి ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జనాల్లో టీడీపీ కు ప్లస్ గా మారింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సస్పెన్షన్ సందర్భంగా గతంలో కొందరు వైసిపీ నేతలపై వచ్చిన ఆరోపణలు వారికి అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మద్దతుగా నిలవడం వంటి అంశాలు మరోసారి తెరపైకి వచ్చాయి. కొందరైతే ఏకంగా హత్యచేసి క్రిమినల్ కేసుల్లోనే ఇరుక్కున్నారు. అయినా గానీ, కొందర్నీ జైలుకెళ్ళి మరీ జగన్ పరామర్శించి రావడం జనాల్లోనూ సోషల్ మీడియాలోనూ తీవ్ర చర్చనీయాంశమైంది.వరద సహాయక చర్యల్లో కూటమి మంత్రులు సైతం చాలా యాక్టివ్ గా పనిచేసారు. మున్సిపల్ మంత్రి నారాయణ, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, హోం మంత్రి అనిత అయితే వరద ఉన్నన్ని రోజులూ నిద్రాహారాలు మాని తిరిగారు. లోకేష్, నాదెండ్ల మనోహర్ లాంటి మంత్రులూ ఇదే పంథాలో పనిచేశారు. తనకున్న ఫ్యాన్ ఫాలోయింగ్ ని దృష్టిలో పెట్టుకుని సహాయక చర్యలకు ఆటంకం కలగకుండా ఉండేందుకు ఎక్కువగా ఫీల్డ్ లోనికి రాకపోయినా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆర్థికంగానూ, తన శాఖల పరంగానూ తనవంతు కృషి తాను చేశారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులు కూడా ఎంతో కొంతమేర తమ తమ విధులు నిర్వర్తించారు. అన్నింటినీమించి కొన్ని విపత్కర సమయాల్లో మంత్రులు సొంతంగా నిర్ణయాలు తీసుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఇది కూటమి పాలనా శైలిపై ప్రజల్లో కొంత సానుకూల దృక్పథాన్ని పెంచింది.అయితే గత ప్రభుత్వంలో ఈ పాయింట్ మిస్సయింది అని ఆ పార్టీ నుండి బయటికు వచ్చిన నేతలే అంటున్నారు. ఒకరిద్దరు మినహా మిగిలిన మంత్రులకు పెద్దగా స్వేచ్ఛ ఉండేది కాదని పార్టీ ముఖ్యులు చెప్పిన అంశాలు తప్ప ఇతర విషయాల్లో సొంతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయేవారనే విమర్శలు ఇప్పటికీ వినిపిస్తుంటాయి. అలాంటి స్వేచ్ఛ ఆ పార్టీలో ఉండి ఉంటే గత ఎన్నికల్లో వైసీపీ ఇంత ఘోరంగా ఓడిపోయి ఉండేవారు కాదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో సైతం ఉంది. ఓవరాల్ గా వరదల సందర్భంగా అందివచ్చిన అవకాశాన్ని కూటమి ప్రభుత్వం రెండు చేతులా అందిపుచ్చుకుంటే.. కీలకంగా వ్యవహరించాల్సిన వైసిపీ మాత్రం ఎక్కడో స్ట్రాటజీ లోపంతో ఇబ్బందిపడుతోంది అన్న మాటలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నికల్లో ఊహించని స్థాయిలో నష్టపోయిన వైసీపీ భవిష్యత్తులో ఏం చేస్తుంది, ఒక్కో మెట్టు పేర్చుకుని కంచుకోట తయారు చేసుకుంటారా.. ఇలాగే వ్యవహరించి మరోసారి దెబ్బతింటారా అని చర్చ జరుగుతోంది. త్వరలోనే వైసిపీ ఈ అంశాలను సరి చూసుకుంటుందో, లేదో...!

## 45 మంది కార్పొరేటర్లు టీడీపీ గూటికి

**నెల్లూరు :** కష్టకాలంలో వారంతా పార్టీ వెన్నంటే ఉన్నారు అధికారంలోకి వచ్చేందుకు ఐదేళ్లపాటు తీవ్రంగా శ్రమించారు. గత ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ.. అప్పటి అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాడి కేసులు పెట్టించుకున్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కష్టాలు నుంచి గట్టెక్కుతామని భావించారు. అయితే వారి ఆశలు అడియాశలవుతున్నాయి. గతంలో అధికార పార్టీలో ఉన్న వారంతా ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలోకి వలస వస్తున్నారు. దీంతో తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పుడు కూడా వారి పెత్తనమే భరించాలా అని నాయకుల్ని నిలదీస్తున్నారు. ఇంతకీ ఆ పరిస్థితి ఎక్కడంటారా?నెల్లూరు జిల్లాలో గత అయిదేళ్లు వైసీపీ పెత్తనమే నడిచింది. జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు వైసీపీ దక్కించుకుంది. నెల్లూరు నగరపాలక సంస్థలో ఉన్న 54 మంది కార్పొరేటర్లు వైసీపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారే.. అప్పట్లో తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అనేక సార్లు ప్రభుత్వ వ్యతిరేక పోరాటాలు చేసి కేసుల పాలయ్యారు. ప్రత్యర్థుల వేధింపులు తట్టుకోలేక పలువురు సొంతూళ్లు వదిలి ఇతర ప్రాంతాలకు వెళ్లి దాక్కోవాల్సి వచ్చింది.అలాంటి వారి ఎదురుచూపులు ఫలించి 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. దీంతో తమకు మంచి రోజులు వచ్చాయని తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. అయితే ఆ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచిన ఆ పార్టీ నేతలు నిరాశనిస్పృహల్లోనే కనిపిస్తున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సాయశక్తులా ప్రయత్నించిన తమకు సరైన గుర్తింపు లేదని వాపోతున్నారు. మరో పక్క వైసీపీ నేతలు తెలుగుదేశం పార్టీలో చేరేందుకు క్యూలు కడుతుండటం వారిని మరింత కలవరపరుస్తోంది.రాష్ట్రంలో అధికారం మారినప్పటి నుంచి అంత కాలం పెత్తనం చెలాయించిన వైసీపీ నేతలు పక్కచూపులు చూడటం మొదలుపెట్టారు. గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో టచ్‌లోకి వెళ్లి పార్టీ మారడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. మంచి సమయం చూసుకొని అధికారికంగా సైకిల్ ఎక్కేందుకు ముహూర్తాలు సిద్ధం చేసుకున్నారు. అయితే పార్టీలో చేరేందుకు టీడీపీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో మూడు నెలలపాటు ఎదురుచూపులు తప్పలేదు.ఇటీవలే ఇతర పార్టీ నేతలను ముఖ్యంగా వైసిపి నేతలను పార్టీలో చేర్చుకునేందుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వైసీపీలో ఉన్న నేతలు అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న 54 మంది కార్పొరేటర్లలో సుమారు 45 మంది పైగా తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని సమాచారం. మరొక పక్క ఆర్యవైశ్య సంఘం నేత ముక్కాల ద్వారకానాథ్ కూడా తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.ఇప్పటికే ఓసారి మంత్రి నారాయణ ద్వారా ద్వారకానాథ్ చేసిన ప్రయత్నాలు ఓ కొలిక్కి వచ్చాయంట. ఏడు మంది కార్పొరేటర్లతో కలిసి ముక్కాల ద్వారకానాథ్ విజయవాడలోని మంత్రి కార్యాలయంలో కలిశారు. చంద్రబాబు నాయుడుని కలిసి అనంతరం సోమవారం ఆయన తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకునే తంతు పూర్తవుతుందని సమాచారం. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయంటున్నారు. ఈ తతంగాలన్నీ తెలిసి జిల్లా తెలుగుదేశం శ్రేణులు తీవ్ర నిరాశకు లోనవుతున్నాయి. అంత మంది కార్పొరేటర్లను చేర్చుకుంటే ఆయా డివిజన్లలోని తమ పరిస్థితి ఏంటని టీడీపీ నేతలు వాపోతున్నారు.వైసిపికి కంచుకోటగా ఉన్న నెల్లూరు జిల్లాలో కూటమి అధికారంలోకి రావడంతో పరిస్థితి తారు మారవుతోంది.

## మీవి తిరోగమన నిర్ణయాలు... మళ్లీ మొదటికే తీసుకెళుతున్నారు

-మొదటిపేజీ తరువాయి

నాడు మీరు విపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియంను వ్యతిరేకిస్తూ మీరు, ఈనాడు న్యాయస్థానాలకు వెళ్లి అడ్డుకున్న తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదు అని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలను, ఆ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులను తక్కువగా చూసే మీ మనస్తత్వాన్ని మార్చుకోండి చంద్రబాబు గారూ అంటూ జగన్ ట్వీట్ చేశారు. పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించే ఆయుధం చదువు మాత్రమే, అందుకే ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసే పనులను తక్షణమే మానుకోండి... మేం తీసుకువచ్చిన విద్యా సంస్కరణలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లండి... లేకపోతే మీరు చరిత్రహీనులుగా మిగిలిపోతారు అని స్పష్టం చేశారు.

## ఎక్కడ చదివావో ఏమో...

-మొదటిపేజీ తరువాయి

గురించి లెక్చర్ ఇవ్వడం వింతగా ఫేకు జగన్ అంటూ కౌంటర్ ఇచ్చారు. కనీస అవగాహన లేకుండా రాత్రి ఆత్మలతో మాట్లాడి, ఉదయం మీరు తీసుకున్న నిర్ణయం వెయ్యి ప్రభుత్వ పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థుల పాలిట శాపంలా మారింది. సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు రాయడానికి అవసరమైన సామర్థ్యం పెంపు, ఉపాధ్యాయులకు ఎటువంటి శిక్షణ ఇవ్వకుండానే పరీక్షా విధానం మార్చడం వల్ల పదో తరగతి చదువుతున్న 75 వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆత్మలతో కాకుండా నిపుణులతో చర్చించి... వచ్చే విద్యా సంవత్సరం 6వ తరగతి నుంచే పరీక్షల విధానంలో క్రమంగా మార్పులు తీసుకువచ్చి సీబీఎస్ఈలో పరీక్షలు రాసేందుకు సిద్ధం చేస్తాం. గుడ్లు, చిక్కి, ఆఖరికి ఆయమ్మల జీతాలు కూడా బకాయి పెట్టి పోయిన కంస మామ అయిన మీరు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాను అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. అన్నట్టు మీరు అంత ఉద్ధరిస్తే... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందో చెప్పండి" అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు.

## ఒకేరోజు 13,326 గ్రామసభలతో ప్రపంచ రికార్డుకెక్కిన ఏపీ

-మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబుకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గత నెల 23న 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించడంలో భాగస్వాములైన అధికారులు, స్థానిక సంస్థలు, ప్రతినిధులకు పవన్ అభినందనలు తెలిపారు. స్వపరిపాలన ఆకాంక్ష ప్రయాణంలో కొత్త మైలురాయి ఆనందంగా ఉందని జనసేనాని తెలిపారు. హైదరాబాద్‌లోని పవన్ నివాసంలో సోమవారం ఉదయం వరల్డ్ రికార్డు యూనియన్ అధికారులు ఆయన చేతికి ధృవపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి కృష్ణతేజ కూడా పాల్గొన్నారు.

## ప్రధాని మోదీని కలవడం సంతోషం కలిగించింది




-మొదటిపేజీ తరువాయి

పెట్టుబడిదారుల సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీని కలవడం సంతోషం కలిగించిందని తెలిపారు. ఈ సదస్సుకు హాజరై, ఏపీలో ఉన్న అపారమైన పునరుత్పాదక ఇంధన శక్తిసామర్థ్యాల గురించి వివరించానని వెల్లడించారు. భిన్న రకాల వాతావర ణాలను తట్టుకునేలా మన ఇంధన రంగానికి అనుకూల వ్యూహాలను రూపొందించడం అత్యావశ్యకం అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. అందుకోసం... శక్తి ఉత్పాదన, ప్రసారం, పంపిణీ, శక్తి వినియోగ విధానంలో ప్రాథమిక మార్పు అవసరం అని పేర్కొన్నా రు. ఈ కోణంలోనే, 4వ ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సు ప్రాధా న్యత సంతరించుకుందని వివరించారు. ప్రజా శ్రేయస్సు కోసం సాంకేతికత అంశంలో ఏపీ అగ్రగామిగా ఉందని, ఇప్పుడు ఇంధన రంగం వంతు అని చంద్రబాబు స్పష్టం చేశారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# జిల్లాలో 13 మంది ఎస్ఐ లకు స్థాన చలనం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)

జిల్లాలో 13 మంది ఎస్ఐ లకు స్థాన చలనం జరిగింది. వీఆర్‌లో ఉన్న పలువురు ఎస్ఐలకు స్టేషన్ కేటాయించారు. మరికొందరిని విఆర్‌కు పంపించారు. జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కనిగిరి ఎస్ఐగా టి శ్రీరాం, హనుమంతునిపాడు ఎస్ఐగా కె మాధవరావు, పిసి పల్లి ఎస్ఐగా కోటయ్య, పామూరు ఎస్ఐగా కిషోర్ బాబు, సిఎస్‌పురం ఎస్ఐ గా సుమన్, వెలిగండ్ల ఎస్ఐగా మధుసూదనరావు, కొమరోలు ఎస్ఐగా యం వెంకటేశ్వర్లు నాయక్, కొనకనమిట్ల ఎస్ఐగా టి రాజ్ కుమార్, తర్లుపాడు ఎస్ఐగా బ్రహ్మనాయుడు, పుల్లలచెరువు ఎస్ఐగా పి రాజేష్‌లను నియమించారు. కాగా త్యాగరాజు, శివ నాగరాజు, ప్రేమ్ కుమార్‌లను జిల్లా వీఆర్‌కు పంపించారు.



# మందుబాబులకు అడ్డాగా సూర్య గార్డెన్ రెస్టారెంట్

అడ్డగోలుగా మద్యం విక్రయాలు!..

అటువైపు కన్నెత్తి చూడని అధికారులు

అడ్డరోడ్డు అడ్డంగా రాత్రింభవళ్లు సిట్టింగులు

ఎక్సైజ్, పోలీస్ ఉందో లేదో అర్థం కాని వైనం !

జిల్లా ఎస్పీ ఉత్తర్వులు లెక్కచేయని కిందిస్థాయి సిబ్బంది

(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, సెప్టెంబర్ 16)

మద్యం కావాలా రెస్టారెంట్లకు రండి అన్నచందంగా వావిలేటిపాడు అడ్డరోడ్‌లోని "సూర్య గార్డెన్ రెస్టారెంట్" దర్శనమిస్తోంది. గార్డెన్ రెస్టారెంట్ అనగానే చక్కటి బిర్యాని, ఆహ్లాదకరమైన వాతావరణం అనుకొని ఫ్యామిలీలు వెళితే ఇక అంతే సంగతులు! (తరువాయి 4లో...)

# వైసీపీ దళిత ద్రోహి పార్టీ

ప్రశ్నించే వారికి ఆ పార్టీలో మనుగడ లేదు

ఆరోగ్యశ్రీ అంతా మాజీ మంత్రుల, అధికారుల అవినీతిమయం

వైద్యం గురించి ఏమీ తెలియని వారు ఆరోగ్య శాఖ మంత్రి

పెత్తనం అంత రెడ్డి సామాజిక వర్గం వారిదే

సొంత నియోజకవర్గాలలో గెలవని వారు వేరే నియోజకవర్గాలలో ఎలా గెలుస్తారు

పార్టీని వీడుతున్నాను

మాజీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ దంపతులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)

నా ఎస్సీ, నా ఎస్టి, నా బీసీ అంటూ ఎల్లప్పుడూ ప్రసంగాలలో ప్రచారం చేసుకునే జగన్ పార్టీ, ఆచరణలో మాత్రం ఎస్సీ, ఎస్టి, బీసీలకు ద్రోహం చేసే పార్టీ అని మాజీ ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు, నాగులుప్పలపాడు మండలం జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ రత్న భారతిలు ధ్వజమెత్తారు. ఒంగోలులోని డాక్టర్ అశోక్ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్ బాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ నిధులు మొత్తాన్ని రాష్ట్ర మంత్రులు, అధికారులు, హాస్పిటల్ ల యాజమాన్యాలు దోచుకుతిన్నాయన్నారు. పేదవారికి సక్రమంగా ఈ పథకం చేరువ కాలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద వారికి ఈ పథకాన్ని చేరవేసేందుకు తిరిగి ఎంత ప్రయత్నించినా సఫలం కాలేదన్నారు. ఏ హాస్పిటల్ కి వెళ్లిన ఫలానా మంత్రి కి ప్రతి నెల మామూలు వంపిస్తున్నామని, ఫలానా అధికారికి వారి వారి ఆమ్యాలు ముట్టుతున్నాయని, హాస్పిటల్ నుండి వెళ్లిపోవాలని, లేనిపక్షంలో మీ పదవికే ముప్పు వస్తుందని బెదిరించే వారిని వాపోయారు. వీటన్నిటిపై ప్రభుత్వ సమావేశాలలో ప్రశ్నిస్తే తనని సమావేశాలకు రానీకుండా చేశారన్నారు. కేవలం బొమ్మలాగా చూస్తూ కూర్చోవాలని, వచ్చే జీతంతో ఆనందించాలే తప్ప ప్రశ్నించకూడదని హేతవు పలికారు అన్నారు. వైద్యం గురించి ఏమి తెలుసని విడుదల రజినీకి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి పదవి ఇచ్చారు తనకి ఇప్పటికీ తెలియటం లేదన్నారు. మామూళ్ల వసూళ్లు తప్ప విడుదల రజనీకి తన శాఖపై ఎటువంటి పట్టు లేదన్నారు. అలాగే సీఎంఓ కార్యాలయంలో పనిచేసే హరికృష్ణ, మరి కొందరి అధికారుల పెత్తనం ఆరోగ్యశ్రీపై సాగిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుండి పార్టీలోనే కొనసాగుతున్నామన్నారు.

(తరువాయి 4లో...)



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్16)

నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావలసిన వాటా నీటిని సాధించడంతో పాటుగా జిల్లాలో వరి సాగుకు నీరందించాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి ని జిల్లాకు చెందిన రైతు సంఘాల నాయకులు కోరారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని మంత్రి క్యాంప్ ఆఫీసులో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని రైతు సంఘాల నాయకులు కలిసి రైతాంగ సమస్యలపై వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లను పెట్టించటంలో వేగం పెంచాలని, రబీ సాగును దృష్టిలో ఉంచుకొని సాగర్ జలాలతో రిజర్వాయర్ నింపాలని కోరారు. శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు రిజర్వాయర్ పథకం పూర్తి చేయుటకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, సహాయ పునరావాసం పై దృష్టి సారించాలని కోరారు. కొండేపి నియోజకవర్గ పరిధిలోని మండలాలు నాగార్జునసాగర్ కుడి కాలువతో గాని, వెలిగొండ రిజర్వాయర్ పథకం తో గాని అనుసంధానింప పడలేదన్నారు. ఆయకట్టు కల్పింపబడలేదన్నారు. ఈ ప్రాంతాలకు తగు న్యాయం చేయడానికి, వాగులను జీవ నదులుగా మార్చేందుకు, పుష్కలంగా వేలాది ఎకరాలకు నీరు అందించేందుకు ముసి, పాలేరు వాగులపై హనుమంతరావు టెక్నాలజీ చతుర్వేది జల ప్రక్రియ అమోఘంగా ఉపయోగపడుతుందన్నారు. స్వల్ప కాలంలో, స్వల్ప నిధులతో సహకారం అయ్యే ఈ విషయంపై మంత్రి దృష్టి సాధించాలని కోరారు. ఖరీఫ్ కాలం ముగిసి, అక్టోబర్ నుండి రబీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తరఫున జిల్లాలో అధికారిక సమావేశం కడా ను ఏర్పాటు చేయాలని కోరారు. బాగా నీ సాగైనా వరి పంటకు నీరు అందించాలని కోరారు. కడా సమావేశానికి (తరువాయి 4లో...)

# జిల్లా సాగర్ జలాల వాటాను సాధించాలి

- ఆరుతడు పంటలతో పాటు, వరి సాగుకు నీరిందించాలి
- గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్లని వెంటనే పూర్తి చేసి సాగర్ జలాలతో నింపాలి
- వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి వెంటనే చర్యలు చేపట్టాలి
- వెంటనే అధికారిక కడా సమావేశం ఏర్పాటు చేయాలి
- రాష్ట్ర మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామికి వినతి పత్రం అందజేసిన రైతు సంఘాల నేతలు
- రైతాంగ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి



# సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రాచరికనికి అంతం

పోడియం రెయిలింగ్ తొలగించిన తర్వాత కార్యాలయం

నేడే అన్నిచోట్ల కొత్త విధానం అమలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 16)

సబ్ రిజిస్టార్ కార్యాలయాల్లో బ్రిటిష్ వారసత్వరాచరిక వ్యవస్థకు సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్వస్తి పలికారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక చాంబర్ రెయిలింగ్ వంటివన్నీ తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోషిదియా జారీ చేసిన ఆదేశాలతో మార్కాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆదివారం,సోమవారం నుంచి మార్పులు మొదలయ్యాయి. ఇప్పటివరకు సబ్ రిజిస్టర్ పోడియం ఎత్తుగా (తరువాయి 4లో...)

# మందుబాబులకు అడ్డాగా సూర్య గార్డెన్ రెస్టారెంట్



ఎందుకంటే అక్కడ తాగుబోతులు దర్శనమిస్తారు. పేరుకే గార్డెన్ రెస్టారెంట్ బిర్యానీని చూపించి మందు అమ్ముకుంటున్నారు. రాత్రింబవళ్లు సిట్టింగులతో పాటు పేకాట శిబిరాలు ఏర్పాటు చేయడంతో అడ్డ రోడ్డు వాతావరణం ప్రమాదకరంగా మారింది. మూడు రోడ్ల కూడలిలో.. హైవే ప్రక్కన ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీ వాతావరణం లో మద్యం విక్రయాలు, సిట్టింగులతో "సూర్య గార్డెన్ రెస్టారెంట్'ను ఏర్పాటు చేశారు. పిల్లి గుడ్డిదైతే ఎలుక ఏదో చూపించినట్లు చర్యలు తీసుకోవలసిన పోలీస్, ఎక్సేంజ్ అధికారుల నిర్లక్ష్యం నిర్వాహకులకు అవకాశంగా మారింది. బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతులు ఇచ్చినట్లు కనబడుతోంది! దీని అలుసుగా తీసుకొని నిర్వాహకులు రాత్రింబవళ్లు మద్యం విక్రయాలతో పాటు సిట్టింగులు ఏర్పాటు చేసి "సూర్య గార్డెన్ రెస్టారెంట్' ను బార్ అండ్ రెస్టారెంట్‌గా మార్చేశారు. ఒకవైపు జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అక్రమ మద్యం, ఇసుక, మాదకద్రవ్యాలు, బెట్టింగులు, సిట్టింగుల పై ఉక్కు పాదం మోపాలంటూ హెచ్చరికలు జారీ చేస్తుంటే!.. దీన్ని అమలు చేయడంలో కింద స్థాయిలో అధికారులు విఫలమౌతున్నారు. లా అండ్ ఆర్డర్‌ను అక్రమార్కులకు అప్పచెబుతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి "సూర్య గార్డెన్" రెస్టారెంట్ పేరుతో.. మద్యం విక్రయాలతో పాటు సిట్టింగులు నిర్వహిస్తున్న సూర్య బార్ అండ్ రెస్టారెంట్ పై తనిఖీలు నిర్వహించి చర్యలు చేపట్టాలని, ప్రధాని కూడలి కావడంతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని, వాహన చోదకులను, అటువైపు వెళ్లే మహిళలను కాపాడాలని కోరుతూన్నారు.

# జిల్లా సాగర్ జలాల వాటాను సాధించాలి

జిల్లాలోని రైతు సంఘాలతో పాటు, రైతులను, ప్రజా సంఘాలను కూడా ఆహ్వానించాలని, సాగునీటి శాఖ అధికారులను అప్రమత్తం చేసేందుకు ఈ సమావేశం ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు. అలాగే పొదిలి పెద్ద చెరువుకు పైపులైన్ ద్వారా సాగర్ నీటిని మళ్ళించే పథకం మధ్యలో ఆగిపోయిందని, దానిని పూర్తి చేయించి ఆ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చాలని ఈ సందర్భంగా కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే కడా సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, సమావేశానికి రైతు సంఘాల నాయకులతో పాటు,



రైతులను, ప్రజా సంఘాల నాయకులను కూడా పిలవాలని ఈ సందర్భంగా అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ సైదా, ఒంగోలు నగర అధ్యక్షురాలు తురకపల్లి నాగలక్ష్మి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, విప్లవ రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి సుబ్బారావు, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎస్.కె మాబు, తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలవరపు వెంకటరామయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంత్ బాబు,ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుధాకర్ రావు, రైతు సంఘం నాయకులు మండల శ్రీనివాసరావు, వి వెంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సబ్ రిజిస్టార్ కార్యాలయంలో రాచరికనికి అంతం



అక్కడ చెక్కలతో కూడిన రేయిలింగ్ ఉండేది. కార్యాలయంలో సబ్ రిజిస్టార్ ఎత్తులో కూర్చునేవారు క్రమ విక్రయాలకు వచ్చిన వారు ఎవరైనా సరే సబ్ రిజిస్టర్ ముందు నిల్చోని ఉండాల్సిందే. మార్కాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఇప్పుడు ఇదంతా మారుస్తున్నారు.

**కూర్చోబెట్టి నీరు టీ ఇచ్చి....**

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనీ అధికారుల మాదిరిగానే సబ్ రిజిస్ట్రార్లు కూడా పూర్తి నేల ఏర్పాటు చేస్తున్నారు. ఎత్తయిన కుర్చీ తొలగిస్తున్నారు. వారి ముందు సామాన్యులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రమ విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తే వారికి తాగునీరు అందించడంతోపాటు వీలైతే టీ కాఫీ అందించాలని ప్రభుత్వ అధికారులు మెమోలో పేర్కొన్నారు.

**నేటి నుంచి కొత్త విధానం అమలు**

ఈ మేరకు మార్కాపురం పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అందుకు తగ్గట్టుగా సోమవారం మార్పులు చేశారు. మార్పులు చేసి మంగళవారం నాటికి స్నేహపూర్వక కార్యాలయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు చేస్తున్నారు.

# వైసీపీ దళిత ద్రోహి పార్టీ

ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు జగన్ పాదయాత్రలో తోడుగా నిలిచాను అన్నారు. అందుకే తనకు ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ గా పదవి ఇచ్చారని, తన భార్యకు నాగులుప్పలపాడు మండల జడ్పిటిసి పదవి ఇచ్చారని నాయకులు చెప్పేవారన్నారు. అంతకుమించి ఆ పార్టీలో తమకి ఒరిగిందేమీ లేదన్నారు. ఎమ్మెల్యే పదవికి స్థానికంగా ఉండేవాళ్లు పోటీ చేసేందుకు పనికిరారా ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో గెలవలేని వాళ్ళని ఇతర నియోజకవర్గాలలో నిలిపితే ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. అనాలోచిత సీట్ల పంపకం వల్లే వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా నామరూపము లేకుండా పోయిందన్నారు. అయినప్పటికీ పార్టీలో ఎందుకు ఓడిపోయామని ఇప్పటికీ సరైన చర్చ జరగటం లేదన్నారు. పార్టీలో కొనసాగాలంటే అవమానకరంగా ఉందన్నారు. అందుకే పార్టీని వీడుతున్నామన్నారు. నాగులుప్పలపాడు మండల జడ్పిటిసి డాక్టర్ రత్న భారతి మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి చేద్దామంటే నాయకులు అడ్డుపడేవారున్నారు. ఎమ్మెల్యే ఎస్సీ అయినప్పటికీ ఎస్సీలకు సరైన సహకారం అందించే వారు కాదన్నారు. కేవలం అగ్రవర్ణాల నాయకులు చెప్పిన మాటలే వినేవారు అన్నారు. దళితులకు గౌరవం లేని వైసీపీలో కొనసాగటం అవమానకరంగా భావించి పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నామని పేర్కొన్నారు.

# స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌గా మహిళా న్యాయవాది కుమారి నంద

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)**

ఈ నెల 14, 15 వ తేదీలలో అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో జరిగిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ , బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలలో ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద 2 పతకాలు సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో బాపట్ల జిల్లా తరపున 76 కేజీల విభాగంలో పోటీపడి బెంచ్ ప్రెస్ నందు గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ చాంపియన్ గా నిలిచారు. అంటే కాకుండా అన్ ఎక్యూపుడు పవర్ లిఫ్టింగ్ విభాగంలో 265కేజీల బరువును ఎత్తి మరొక రజిత పతకాన్ని తన ఖాతా లో




వేసుకున్నారు. మొత్తంగా ఈ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కుమారి నంద రెండు పతకాలు గెలిచి బాపట్ల జిల్లా తరపున విజయ జెండాని ఎగురవేశారు. అయితే ఈ పోటీలలో కుమారి నందకి ఎడమ చేయి చిన్న పాటి ఇన్జూరి అయ్యినట్లు సమాచారం. పోటీలు జరుగుతున్నప్పుడే మధ్యలో బెంచ్ ప్రెస్ చేస్తున్న సమయంలో చేతికి ఇన్జూరి అయినప్పటికీ పోటీలలో నిష్క్రమించకుండా ఈ పోటీలలో పాల్గొని విజయం సాధించిన కుమారి నంద క్రీడా స్ఫూర్తికి అభినందనలు వెల్లువెత్తాయి. ఇప్పటికే బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కి వైస్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తూ వృత్తి రీత్యా న్యాయవాదిగా సేవలందిస్తూనే కుమారి నంద పవర్ లిఫ్టింగ్ క్రీడ మీద మక్కువతో పోటీలలో పాల్గొంటూ పతకాలు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులు, ఏల్చూరు గ్రామస్తులు, బాపట్ల జిల్లా క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తూ పలువురు అభినందనలు తెలిపారు.




# వరద బాధితులకు ఆర్థిక సాయం



**(షణ్ముఖ వెలుగు, కొనకనమెట్ల, సెప్టెంబర్ 16)**

విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచనలతో కొనకనమెట్ల మండలంలోని గొట్లగట్టు, గరిమినపంట గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 2,16,000లను సోమవారం మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్‌కు గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖదేవ్, పరిటాల సుబ్బయ్య, ఎదుబాటి మల్లికార్జునలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పొదిలి తిరుపతయ్య, వేముల శ్రీను, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

## నిర్వహణ వ్యయాన్ని అంచనాలు రూపొందిస్తాం

## త్వరలో రైతులకు అందుబాటులోకి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, 16)**



వెల్దుర్తి మండల పరిధిలోని రైతులకు సాగు,తాగునీరు అందించే జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కేంద్రాన్ని సోమవారం మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి పరిశీలించారు. నిర్వహణ సరిగా లేక లిఫ్ట్ ఇరిగేషన్ అటుకెక్కిందని రక్షణ కరువై గత ప్రభుత్వ హయాంలో జెర్రీ వాగు ప్రాజెక్టుకు సంబంధించి మోటర్లు పలు విద్యుత్ పరికరాలు చోరీకి గురైన విషయాన్ని ఎమ్మెల్యే జూలకంటి దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. గత వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. జెర్రీ వాగు లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి నిర్వహణ వ్యయాన్ని అంచనాలు రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపారు. త్వరలోనే రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి తీసుకువచ్చి రైతులకు సాగు. వెల్దుర్తి మండలం గ్రామాల్లో తాగునీరు అందిస్తామన్నారు. అలాగే లిఫ్ట్ ఇరిగేషన్ ప్లాంట్ భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అవసరమైన చోట్ల పంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్నదాతలను ఆదుకుంటామని తెలిపారు.

# అంత్యక్రియలకు పొదిలి మానవతా సభ్యుల ఆర్థిక సాయం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 16)**

పొదిలి నగర పంచాయితీలోని నవాబ్ మిట్టలో అనారోగ్యంతో మరణించిన షేక్ ఖాదర్‌బీ అంత్యక్రియలకు వారి భర్త అభ్యర్ధన మేరకు సోమవారం పొదిలి మానవతా సభ్యులు ఆమె ఇంటికి వెళ్లి ఆమె భర్తకు రూ.5000 ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మానవతా జిల్లా కన్వీనర్ కె.యల్లమందా రెడ్డి, మండల కన్వీనర్ కల్లం వెంకట సుబ్బారెడ్డి, డైరెక్టర్ యక్కలి శేషగిరి, సెక్రెటరీ అశోక్ బండి, జాయింట్ సెక్రెటరీ భూమా సుమంత్, శాంతి కమిటీ ఎద్దు నగేష్, మీడియా ప్రతినిధి షేక్ బాజీ కరీముల్లా, సభ్యులు షేక్ యాసీన్, షేక్ షహీద్, షేక్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)

బిజెపి జాతీయ కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఒంగోలు రాం నగర్ 1 వ లైన్‌లో బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విజయా రావు ప్లాట్‌లో బిజెపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను జరుపుకోవటము జరిగింది. ఈ సందర్భంగా విజయా రావు మాట్లాడుతూ గత ఎన్నికలలో పార్టీ నన్ను సత్య కుమార్ యాదవ్ విజయం కోసం ధర్మవరంలో పని చేయమని పంపింది అని అప్పటి నుండే సత్యకుమర్ యాదవ్ తెలుసని ఆయనగెలుపు కోసం 25 రోజులు ధర్మవరంలో పని చేయడం జరిగిందని ఆయన గెలవటమే కాకుండా రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రిగా నియమించటం చాలా ఆనందముగా ఉన్నదని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ మాట్లాడుతూ సత్యకుమార్ యాదవ్ గారితో నాకు 1999 నుండే పరిచయం ఉన్నదని ఆయన వెంకయ్య నాయుడు పీఏ కావడం వలన ప్రకాశం జిల్లాలో ప్రతి బిజెపి కార్యకర్తలను నాయకులను పేరుపెట్టి పిలిచే పరిచయాలు ఉన్నాయని. ఆయన అపర చాణక్యుడు అని. ఒక్కసారి ఆయన తోపరిచయము ఏర్పడితే చాలు ఎన్ని రోజులైనాగాని పేరుపెట్టి పిలిచే జ్ఞాపక శక్తి ఆయన దని. ఆయన మైండ్ లోనే ఒక లైబ్రెరీ ఉన్నదని. వెంకయ్య నాయుడు బిజెపి జాతీయ అధ్యక్షుడు గానూ కేంద్ర మంత్రి గా ఉండటము వలన ఆయన పీఏగానూ ఓఎస్‌డీగా ఉండటం వలన ఈ నాటి ప్రధాన మంత్రి మరియు హెూమ్ మంత్రి అమిత్ షా కూడా బిజెపి జాతీయ అధ్యక్షుడు వెంకయ్య నాయుడు ని కలవాలంటే ముందుగా సత్య కుమార్ యాదవ్‌ని కలిసిన పిదపే వారు వెంకయ్య నాయుడు ని కలిచేశారన్నారు. అందుకే మోడీకి, అమిత్ షా లాంటి వాళ్ళు కూడా సత్యకుమర్ యాదవ్ సేవలు దేశానికి అవసరమనే భావించి ఆయనను రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రిగా నియమించాలని చంద్ర బాబు నాయుడుకి చెప్పడం జరిగిందన్నారు. రాష్ట్ర మంత్రిగా గా ప్రజలకు



సేవ చేసి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంటారు అని, సత్య కుమార్ యాదవ్ మంత్రిగా ఉండటాన్ని బీసీ వర్గాలు ఎంతో ఆశతో ఉన్నాయని బిజెపి లో సరైన బిసి నాయకుడు ఉన్నాడని గర్వంగా ఉన్నారని ప్రత్యేకించి యాదవ సామజిక వర్గానికి బిజెపి లో ప్రాధాన్యత కల్పించటాన్ని ఆ వర్గ ప్రజలు చాలా సంతోషంగా, గర్వంగా ఉన్నారని కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుతూ మరెన్నో జన్మది నాలుజరుపు కోవాలనికోటుచూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మి నరసింహారావు, బొద్దులురి ఆంజనేయులు, రాయపాటి అజయ్, మాకినేని అమరాసింహ, సీతారామయ్య, తీగల సత్యవతి, కృష్ణా రెడ్డి, అనిల్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, గుఱ్ఱం రంగనాథ్, అల్లరి రామయ్య, మధు యాదవ్, తిరుమల, పెట్లూరి ప్రసాదరావు, పాలపర్తి కమలాకర్, రాజేష్ వర్మ, తానికొండ సురేష్, రమేష్, దనిసెట్టి రాము, ఉమ్మిడిశెట్టి నాగేశ్వరరావు, దనిశెట్టి పావని, అరవింద, శ్రీలక్ష్మి, తిరుమల, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరికలు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16)

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ 4 ఇంఛార్జి మరియు 32 మరియు 33 డివిజన్ల ఇంచార్జీ బెజవాడ మేఘనాథ్ సింగ్ వారి మిత్రబృందం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, మన్నేపల్లి రఘు, టీడీపీ నాయకులు హజరత్ నాయుడు, శైలేంద్ర బాబు, తోట సునీల్, షరీఫ్, అసిఫ్ భాయ్, రాము, ఖాదర్ బాషా, ఎస్.డి. మీరా, జహీర్, నాని, రాజేష్, బాపూజీ, గౌస్ బాషా, కాలేషా, కామాలుద్దీన్, ముఫీద్, డి.సురేష్, నీళ్ల పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక కొరతపై 18న ధర్నా

(షణ్ముఖ వెలుగు, పొదిలి, సెప్టెంబర్ 16)

ఇసుకను సరిపడేంత అందించి భవన నిర్మాణ కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలని, సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సెప్టెంబర్ 18న పొదిలి మండల తహశీల్దార్ ఆఫీసు వద్ద ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం.రమేష్ కార్మికులను కోరారు. తాము అధికారంలోకి వస్తే ఇసుక పాలసీని సమీక్షించి ఉచితంగా సరఫరా చేస్తామని హామి ఇచ్చిన టి.డి.పి.కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో ఇసుక అందుబాటులో లేక భవన నిర్మాణ కార్మికుల పనులు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. తాపీ కార్మికులతో పాటు భవన నిర్మాణ రంగంలో ఉండే 36రకాల పనులు చేసే కార్మికులు పనులపై ప్రభావం పడిందన్నారు. ఫలితంగా రోజు పనులు కోసం వచ్చి తిరిగి వెళ్ళటంతో 50రూపాయలకి పైగా ఆటో చార్జీలకి పెట్టాల్సి వస్తుండటంతో ఇబ్బందులకు గురిఅవుతున్నారు.మెమో 1214ని రద్దుచేసి భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్యకలాపాలను పునరుద్ధరించాలని అన్నారు. గుర్తింపుకార్డులు, పెండింగ్ క్లెయిమ్స్,ఇతర పథకాలకు మళ్ళించిన బోర్డు నిధులను తిరిగి జమచేసి కార్మికులు సంక్షేమానికి ఉపయోగించాలని అన్నారు.పై సమస్యలు పరిష్కారానికి 18న జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు.

## మన్నేరు నుండి అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, సెప్టెంబర్ 16)

మండల పరిధిలోని మన్నేటికోట గ్రామం మన్నేరు వాగువద్ద సోమవారం వేకువఝామున ఉలవపాడు ఎస్ఐ కె. అంకమ్మకు వచ్చిన సమాచారము తో అక్రమముగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణ చేస్తున్నటువంటి 6 ట్రాక్టర్ లను, వాటి యజమానులను అదుపులోకి తీసుకుని ఇసుక లోడు ఉన్నటువంటి 2 ట్రాక్టర్ల మీద క్రిమినల్ కేసులు నమోదు చేసి,ఇసుక లేనటువంటి 4 ట్రాక్టర్ ల యజమానులకి కౌన్సిలింగ్ ఇచ్చి పంపటమైనది. ఈ యొక్క తనిఖీలో ఉలవపాడు ఎస్ఐ కె అంకమ్మ, తోటి సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 16)

కనిగిరి టౌన్ మున్సిపాలిటీ పరిధిలో గల ఎమ్మార్వో కార్యాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పరిశీలించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఓజోన్‌ను రక్షించడం – జీవితాన్ని రక్షించడమే మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 16)

అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం (అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం) సందర్భంగా సోమవారం గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహిస్తారని జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది అని తెలిపారు. సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత కిరణాలను ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వీటి వల్ల వాటిల్లే ముప్పు నుంచి కాపాడుతుందని అన్నారు. మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం,అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని 1987లో ఓజోన్ పొర క్షీణతపై జరిపిన పరిశోధన సంస్థ తెలిపిందని అన్నారు. పర్యావరణ మార్పులపై, ఓజోన్ పొర క్షీణత పై ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం ఉందని ప్రతి ఒక్కరూ సహకరించాలని ఓజోన్‌ను రక్షించడం జీవితాన్ని రక్షించడమే అని అన్నారు.2050 సంవత్సరానికి ఓజోన్ పొరను 1980కు ముందున్నస్థాయికి రావడం కోసం మన వంతు కృషి చేయాలని అందుకు అడవుల నరికివేత ను పూర్తిగా నిలిపి వేయడం,మొక్కలు విరివిగా పెంచడం, యంత్రాల నుంచి వినాశకర వాయువులను విడుదల చేస్తున్న పరిశ్రమలు రక్షణ చర్యలు చేపట్టడం వంటి వాటి పై దృష్టి సారించాలని పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ జివిస్ అండ్ జిడికె ఫౌండేషన్ కోఆర్డినేటర్ పి నవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## క్రయ విక్రయదారులకు గౌరవం దక్కేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల మార్పు హర్షణీయం యాగంటి

(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, సెప్టెంబర్ 16)

మాచర్ల పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇక నుండి ప్రజలతో స్నేహపూర్వకంగా ఉండేలా మార్పుకై సీఎం చంద్రబాబు ఆదేశాలను మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం యాగంటి మల్లికార్జునరావు విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రత్యేక కుర్చీ, రెడ్ క్లాత్‌తో కూడిన పోడియం కలిగి రాజరిక వ్యవస్థను తలపించేలా ఉన్నాయన్నారు. నిత్యం లక్షలాది రూపాయలు ప్రభుత్వానికి చలానాలు చెల్లించి రిజిస్ట్రేషన్‌ల కోసం సబ్



రిజిస్టార్ కార్యాలయానికి వెళితే కనీస మర్యాదలు కూడా దక్కటం లేదన్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి ఒక్కరికి సులువు తరంగా అందించేందుకు కొత్త సంస్కరణలను తీసుకు రావడం శుభ పరిణామమని అది విజన్ ఉన్న నాయకుడైన సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. నాటి జగన్ పాలనలో కొత్త సంస్కరణలు కాదు గదా... ఉన్న వ్యవస్థలన్నీ నిర్వీర్యానికి పాల్పడ్డాడన్నారు. ఐపీఎస్ అధికారులను సైతం చట్టాన్ని అతిక్రమించేలా హుకుం జారీ చేసి జగన్ అధికార దుర్వినియోగానికి ఒడి కట్టాడన్నారు. దానికి తాజా ఉదాహరణ 40 రోజులపాటు చిత్రహింసలకు గురైన ముంబై కు చెందిన సినీ నటి జేత్వాని కేసేనన్నారు. ఐపీఎస్ స్థాయి అధికారులు సస్పెండ్ కు గురి కావడం అనేది నాటి జగన్ రాజరిక పాలన ఎలా కొనసాగిందో అర్థమవుతుందన్నారు. చంద్రబాబు పాలనలో తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష ననుభవించక తప్పదని ప్రత్యక్షంగా కూడా చూస్తున్నామన్నారు. ఏది ఏమైనా సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖా కార్యాలయాల్లో ఉద్యోగస్తులంతా సమానమేనని చూపించే నిర్ణయంపై రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి

## తక్షణమే ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి
## కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి దద్దాల

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, సెప్టెంబర్ 16)



రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషిం చాల్సింది పోయి అవసరం లేదంటూ కూటమి ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణమని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలతో ప్రభుత్వానికి నష్టమా అని ఎంబీబీఎస్ సీట్లు ఇస్తామంటే వద్దనడం ఏమిటని,మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయటం ద్వారా పేద విద్యార్థుల ఆశలు గల్లంతు అవుతాయి అన్నారు.చంద్రబాబు ఏనాడూ ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ కట్టలేదని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపట్టింది అన్నారు. నాణ్య మైన విద్య, వైద్యాన్ని ప్రజలకు ఒక హక్కుగా అదించడం అన్నది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యతని తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి, మంచి వైద్యం అందు కోవడానికి ఏ కుటుంబం కూడా ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకూడదని ఉద్దేశ్యంతో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం విప్ల వాత్మక సంస్కరణలు తీసుకొని వచ్చి ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో రూ.8,480కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించాం. దీనివల్ల ప్రభుత్వానికి ఏ రకంగా నష్టం వస్తుంది? 2023-24 సంవత్సరాల్లో 5 కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావడం నిజం కాదంటారా? తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాష్ట్రానికి రాలేదంటారా? చాలామంది పేద పిల్లలు సీట్లు సాధించి డాక్టర్ చదువులు చదవడం లేదా? నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వెళ్తే ఈ ఏడాదిలోనే మరో 5 కాలేజీలు మదనపల్లె, పులివెందుల, ఆదోని, మార్కాపురం, పాడేరుల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు పాడేరు కాలేజీని 50 సీట్లకే పరిమితం చేయడం దారుణం పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు మంజూరు చేస్తే, వద్దంటూ లేఖ రాయడం విడ్డురంగా ఉందని మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేసే ఆలోచన చేయడం ఏమిటని ఖండించారు. ప్రభుత్వం అర్థం చేసుకోకుండా మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని ఆలోచిం చడం మంచి పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేసారు..ఇలాంటి నిర్ణయాలు సామాన్యులకు వైద్య విద్యను దూరం చేస్తున్నాయని మండిపడ్డారు..ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ కోరారు...

# దళిత యువకులను కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి

### బాధిత కుటుంబ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16)

ముత్తుకూరు మండలంలో దళిత కులానికి సంబంధించిన తమ కుటుంబ సభ్యులను అమానుషంగా కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని పలువురు బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. నెల్లూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తాము ముత్తుకూరు దళిత ఎస్సి కులానికి చెందిన వారన్నారు. విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదంలో తమ కుటుంబ సభ్యులైన అమావాస్య హరీష్, సందీప్ తో పాటు నలుగురిపై ముత్తుకూరు ఎస్ఐ విశ్వనాథరెడ్డి కానిస్టేబుల్ సుమన్ లు విచక్షణా రహితంగా కొట్టారన్నారు. ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్ స్టేషన్లో నిర్బంధం చేసి ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారన్నారు. దళిత నేత అంటూ చాట్ల వెంకటసుబ్బయ్య ఊసరవెల్లి రంగులు మార్చినట్లు పార్టీలు మారేవారని విమర్శించారు. దళితులకు అన్యాయం జరిగితే ప్రశ్నిం చాల్సింది పోయి, తప్పు చేసిన వారికి వత్తాసు పలికేలా వెంకటసుబ్బయ్య ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దళితులపై జరిగిన దాడిని తెలుసుకొని పరామర్శించేందుకు వెళ్లిన దళిత నాయకులైన కొప్పోలు రఘు, వదనాల వెంకటరమణను తప్పుపట్టే అర్హత అతనికి లేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ముత్తుకూరు వెంకటాచలం పోలీస్ స్టేషన్ లో సిఐ, ఎస్ఐ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంట్లో ఉన్న తమ కుటుంబ సభ్యులకు వెంటనే మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు అను, పద్మ, శారద, తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

### మైనారిటీ పరిరక్షణ హక్కుల సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహణ





(షణ్ముఖ వెలుగు, పెద్దదోర్నాల, సెప్టెంబర్ 16)

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మైనారిటీ పరిరక్షణ హక్కుల సమితి అధ్యక్షులు పూలబాబు ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ పరిరక్షణ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పూలబాబు మీడియాతో మాట్లాడుతూ నెలలో రెండు పర్యాయాలు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో మరియు ప్రభుత్వ వైద్యశాలలో మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రయాణికులకు, రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా మైనారిటీ పరిరక్షణహక్కుల సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు,శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం మంచినీటి చలివేంద్రాలు, నిరుపేదలైన వారికి నిత్యవసర వస్తువులు అందించటం మైనారిటీ పరిరక్షణ హక్కుల సమితి ఆధ్వర్యంలో రక్తదానం నిర్వహించటం, తదితర సేవా కార్యక్రమాలు జరుగుతుందని తెలియజేశారు. నిస్వార్థంగా కులమతాలకు అతీతంగాతమ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పూలబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ పరిరక్షణ హక్కుల సమితి అధ్యక్షులు పూలబాబు, షేక్ అబ్దుల్ కరీం,ఉపాధ్యక్షులు అల్లాబకాష్, మహబూబ్ బాషా,సెక్రెటరీ వాజిత్, ఖజానా దారుడు కార్యవర్గ సభ్యులు, చికెన్ వలి,సుభాని తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న భీమాను రూ.5 నుండి రూ.10 లక్షలకు పెంచాలని నిర్ణయించడం హర్షణీయం



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16)

తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, కోవూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ దురదృష్టవశాత్తుతో కుటుంబంలో ఎవరైనా ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం విధిన పడకుండా ,ఆ కుటుంబాన్ని అదుకొనేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా 2015 వ సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రన్న భీమా పథకాన్ని ప్రవేశపెట్టారుఈ పథకం క్రింద ప్రమాద వశాత్తూ మరణించిన వ్యక్తి కుటుంబానికి 5 లక్షల రూపాయలు, సహజ మరణానికి రెండు లక్షలు పరిహారం ఇవ్వడం జరిగింది ఈ పథకం వలన 2015 నుండి 2019 వరకూ లక్షలాది కుటుంబాలకు ప్రయోజనం కలిగింది.అయితే 2019 లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకాన్ని రెండు సంవత్సరాలు నిలిపి వేసి, అనంతరం ఈ పథకంలో అనేక మార్పులు చేసి,వైయస్ఆర్ భీమా అని పేరు మార్చి మొత్తం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసింది. 2019 కు ముందు చంద్రన్న భీమా పథకం క్రింద కుటుంబంలోని 18 సంవత్సరాలు నిండిన వారందరికీ భీమా వర్తింప చేయగా, ఎట్క ఎస్ ఆర్ భీమాలో కుటుంబంలో సంపాదించే వ్యక్తికి మాత్రమే అని కుటుంబానికి ఒక్కరికీ మాత్రమే భీమా వర్తింప చేశారు.దీనివలన గత టిడిపి ప్రభుత్వ హయంలో చంద్రన్న భీమా లో 2.5 కోట్ల మంది లబ్దిదారులు ఉండగా,వైయస్ఆర్ భీమా లో లబ్దిదారులు సంఖ్య 1.22 కోట్లకు తగ్గించారు. అదేవిధంగా 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల మధ్య వారు సహజ మరణం చేందుతే తెలుగుదేశం ప్రభుత్వం రెండు లక్షలు పరిహారం ఇవ్వగా,వైసిపి ప్రభుత్వం దానిని లక్ష రూపాయలకు తగ్గించింది తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రన్న భీమా పథకం క్రింద ఇచ్చే పరిహారాన్ని ఐదు లక్షల నుండి పది లక్షల రూపాయలకు పెంచతామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తను ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో చంద్రబాబు నాయుడు చంద్రన్న భీమా గురించి సమీక్ష చేసి,చంద్రన్న భీమా పరిహారాన్ని 10 లక్షల రూపాయలకు పెంచాలని నిర్ణయించారు. చంద్రన్న భీమా పరిహారాన్ని పెంచాలని నిర్ణయించిన చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఉన్నవిదంగా కుటుంభసభ్యులు అందరికీ చంద్రన్న భీమా వర్తింప చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ సమావేశంలో పంతంగి రాము, ఇంటురు విజయ్, కలికి సత్యనారాయణరెడ్డి, ఇంధుపూరు మురళీకృష్ణ రెడ్డి, గౌరిపాటి నరసింహ, మరుబోయిన వెంకటేశ్వర్లు, సజ్జా అశోక్, ఎస్కె మహ్మద్, సప్పారం వెంకటేశ్వర్లు, ఎఎస్కె, కలిల్, తాళ్ళపాక లక్ష్మయ్య, ఎస్కె వాహిద్, కాకి భగవాన్, ఎస్కె నజీర్, చల్లా సూర్య, పులా యశ్వంత్, పులా కిరణ్, మనేపల్లి పృధ్వీ, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట రాయుళ్ల అరెస్ట్



(షణ్ముఖ వెలుగు, పెద్ద దోర్నాల, సెప్టెంబర్ 16)

మండలంలోని యడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందుకున్న పెద్ద దోర్నాల ఎస్ఐ వి మహేష్ దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1650లు సీజ్ చేయడం జరిగింది. పేకాటఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి కోర్టు హాజరు పరుస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. దోర్నాల మండలంలోని ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగిన పోలీసు వారి దృష్టికి తీసుకురావాల్సిందిగా ఆయన కోరారు. పేకాట శిబిరం పై దోర్నాల ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది, దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.

# ఘనంగా వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 16)

బీజేపీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిసెట్టీ ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎ.శంకర్ మాట్లాడుతూ ఎపిలో కూటమి భాగస్వామ్య మంత్రిగా సత్యకుమార్ తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. జాతీయ స్థాయిలో బిజెపి వ్యవస్థాగతంగా ఎదుగుదలకు కృషి చేస్తూనే రాష్ట్రంలో మంత్రిగా రాణిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి జెవి నారయణ, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ ఖాదర్ వలీ షఫీ, బండారి జయప్రసాద్, మారుతి ప్రసాద్, రమేష్, ముప్పురి శ్రీనివాసులు, రామకృష్ణ, జేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిద్దలూరులో మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, సెప్టెంబర్ 16)

గిద్దలూరు దిగోమెట్ట చెంచు కాలనీ భారతీయ జనతా పార్టీ గిద్దలూరు కో కన్వీనర్ గుమ్మా రాముడు యాదవ్ ఆధ్వర్యంలో ధర్మవరం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా గిద్దలూరులో అత్యంత వైభవంగా పెద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఆకు మల్ల కోటేశ్వరరావు, దిగువమెట్ట చెంచు కాలనీలో గూడెం పెద్ద, లలితమ్మ పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన ప్రకాశం జిల్లా యుటిఎఫ్ ఆటల పోటీలు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16)**

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భముగా ప్రకాశం జిల్లా స్థాయి ఆటల పోటీలను రెండవ రోజు ఒంగోలు నగరంలోని డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్ నందు యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ మధ్య స్నేహభావం, సమైక్యత, సహకార భావం, క్రమశిక్షణ, కలిసి మెలిసి జీవించడం, అభిప్రాయాలను గౌరవించుకోవడం, ఒకరి పట్ల ఒకరు క్రమశిక్షణతో వ్యవహరించడం మొదలు అంశాలను ఈ ఆటల పోటీల ద్వారా ఆటవిడుపుగా అలవాటు అవుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో క్రికెటు, వాలీబాల్ , టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, 100 మీటర్స్, రన్నింగ్ 200 మీటర్స్ రన్నింగ్, 400 మీటర్స్ స్పీడ్ వాకింగ్ , జావలిన్ తో షాట్ పుట్ మొదలు విభాగాల్లో పోటీలు నిర్వహించామని జిల్లా వ్యాప్తంగా రెండు రోజులు సుమారు 600 పైగా ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.యుటిఎఫ్ రాష్ట్ర సంఘం డిసెంబర్ 14, 15 16,17తేదీలలో కాకినాడ నగరంలో స్వర్ణోత్సవ వాల సందర్భంగా ఈ ఆటల పోటీలను నిర్వహించింది. రాష్ట్ర మహాసభలకు యుటిఎఫ్ రాష్ట్ర సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి విద్య పరిరక్షణకు సంబంధించి ఒక విశ్లేషణతో కూడిన నివేదికను అందజేయనున్నది అని తెలియజేసినారు. సోమవారం జరిగిన ఆటలలో క్రికెట్ మొదటి స్థానం వైపాలెం జట్టు సాధించిందని, రెండవ స్థానం ముండ్లమూరు జట్టు, అదేవిధంగా ఉమెన్స్ 400 మీటర్స్ స్పీడ్ వాకింగ్ లో ఎల్ఆర్ఎస్ ప్రవంతి అరుణ కుమారి మెహిబూన్, శ్రీదేవి, 400 మీటర్స్ బిలో 45 విభాగంలో మొదటి స్థానం వి కవిత రెండవ స్థానం వి కల్పన మూడో స్థానం జగదీశ్వరి ఎస్.కె బషీర 100 మీటర్స్ బిలో 45 ఉమెన్స్ విభాగంలో మొదటి స్థానం ఎస్కే మహిబూన్ ,రెండవ స్థానం ఎల్లా ప్రవంతి, మూడో స్థానం టి మీరీ కుమారి, షాట్ పుట్ విభాగంలో మొదటి స్థానం ముండ్లమూరు మండలం చెందిన బి బ్రహ్మయ్య, రెండవ స్థానం ఎస్కే సూరత్ బాషా కొత్తపట్నం మండలం, మూడోస్థానం కే శివ కోటేశ్వరరావు మరిపూడి మండలం విజయం సాధించారు రెండో రోజు ఆటల పోటీలను జిల్లా ఆటల కమిటీ కన్వీన షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో నిర్వహించినారు పైకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఓ వీరారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, జిల్లా సహాధ్యక్షురాలు జి ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి చిన్నస్వామి జిల్లా కార్యదర్శి పి బాల వెంకటేశ్వర్లు, ఎస్వి కొండారెడ్డి, పి ప్రభాకర్ రెడ్డి, కె లక్ష్మీనారాయణ, ఆర్ నారాయణ మొదలుకు వారు పాల్గొన్నారు




# అందుబాటులో వైద్యసేవలు శుభపరిణామం

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16)**

పొదలకూరులోని కెనరా బ్యాంకు వద్ద డాక్టర్స్ క్లినిక్ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఏర్పాటు చేసిన వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నిఖిల్ తేజ, డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ సుజితను ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలకు స్పెషలిస్టు వైద్యసేవలు అందుబాటులోకి తేవడం ఆనందదాయకం అని అన్నారు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పొదలకూరు ప్రాంత ప్రజలకు ప్రైవేటుతో పాటు ఇప్పటికే సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, గతంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పుడు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నాం... త్వరలోనే దయాలసిస్ సెంటర్ కూడా అందుబాటులోకి రానుందని అన్నారు. అందుబాటులో ఉన్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.



# అందుబాటులో వైద్యసేవలు శుభపరిణామం

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16)**

పొదలకూరులోని కెనరా బ్యాంకు వద్ద డాక్టర్స్ క్లినిక్ ఆస్పత్రి ప్రారంభోత్సవం సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.డాక్టర్ సంజయ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ఏర్పాటు చేసిన వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నిఖిల్ తేజ, డాక్టర్ ఆదర్శ్, డాక్టర్ శివకృష్ణ, డాక్టర్ సుజితను ఎమ్మెల్యే సోమిరెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని ప్రజలకు స్పెషలిస్టు వైద్యసేవలు అందుబాటులోకి తేవడం ఆనందదాయకం అని అన్నారు ప్రజలకు మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పొదలకూరు ప్రాంత ప్రజలకు ప్రైవేటుతో పాటు ఇప్పటికే సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని గతంలో రూ.3.80 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పుడు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నాం త్వరలోనే దయాలసిస్ సెంటర్ కూడా అందుబాటులోకి రానుందని అన్నారు.అందుబాటులో ఉన్న వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.




# ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సహకారంతో భారీ అన్నదానం



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 16) యర్రగొండపాలెం కొలుకుల సెంటర్ లో వేంచేసియున్న వరసిద్ధి వినాయక స్వామీ కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టణంలో అన్నాదాన కార్యాక్రమం జరిగింది. వరసిద్ధివినాయక స్వామీ కళ్యాణ మహోత్సవం సందర్భన్ని పురష్కరించుకొని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నాదాన కార్యాక్రమం కోసం 8 క్వింటాళ్ళ బియ్యం, 60వేల రూపాయాల రొక్కం అందించినట్లుగా వినాయక కమీటి సర్కిల్ తెలిపారు.ఫ్రండ్స్ సర్కిల్ కమీటి పేరుతో 29 సంవత్సరాలుగా వినాయక విగ్రహ కార్యాక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు , .ఈసంవత్సరం సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామీ కళ్యాణం మహోత్సవంతో పాటు భారీగా అన్నదాన నిర్వహించదలిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నదానం జరుపడానికి ముందుకు వచ్చి మాకు సహాయంచేసి చేయూత అందించారని తెలిపారు ఆయన సహకారంతో ఇంతటి భారీ అన్నదానానికి పూనుకున్నామని అన్నారు.



# సాధించగలం అనే నమ్మకంతో ముందుకు సాగాలి

## ప్రముఖ సినీ నటులు, రచయిత ప్రదీప్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16) జీవితంలో విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని సాధించగలం అనే నమ్మకంతో ముందుకు సాగాలని ప్రముఖ సినీ నటులు రచయిత ప్రదీప్ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆదివారం భువనేష్ బలైఫ్ స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫర్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మార్కెటింగ్ లో మెలకువలను ప్రతి ఒక్కరూ తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. క్వాలిటీ, నమ్మకం అనే ఆయుధాలతో ఖాతాదారులను పూర్తిస్థాయిలో సంతృప్తి చేయాలన్నారు. ప్రపంచంలో దేశంలో ఎంతోమంది గేమ్ చేజర్లుగా నిలిచిపోయారని వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చునన్నారు. భువనేష్ లైఫ్ స్పేసెస్ వారు మనిషిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు నేటి యువత ఫోన్ మత్తులోంచి బయటకు రావాలన్నారు. భువనేష్ లైఫ్ స్పేసెస్ అధినేత కాకు బాబురావు మాట్లాడుతూ మార్కెటింగ్ సిబ్బందిలో స్కిల్స్ పెంపొందించాలన్న లక్ష్యంతో నిపుణులైన వారిచే ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామన్నారు. భువనేష్ లైఫ్ స్పేసెస్ వారు మనిషిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు నేటి యువత ఫోన్ మత్తులోంచి బయటకు రావాలన్నారు. భువనేష్ లైఫ్ స్పేసెస్ అధినేత కాకు బాబురావు మాట్లాడుతూ మార్కెటింగ్ సిబ్బందిలో స్కిల్స్ పెంపొందించాలన్న లక్ష్యంతో నిపుణులైన వారిచే ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామన్నారు.

# పోగొట్టుకున్న బ్యాగ్ బాధితురాలకు అప్పగించిన పోలీసులు

## పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16) ఒంగోలు కేశవస్వామి పేటకు చెందిన మిందల లలిత సాయి, విక్రమ్ సింహపురి రైల్లో నెల్లూరు నుంచి ఒంగోలు వచ్చి రైల్వే స్టేషన్ వద్ద ఆటో లో ఇంటికి వెళ్లి దిగిపోయింది. ఆటో డ్రైవర్ మేకల ప్రసాద్ ఆటోలో బ్యాగ్‌ను చూసి బ్యాగ్ ను టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు అందజేయగా బ్యాగ్ మరచిపోయి మహిళ వివరాలు తెలుసుకొని బ్యాగ్‌ను 2 టౌన్ పోలీసులు ఆటో డ్రైవర్ సమక్షంలో మహిళకు అందజేయడం జరిగింది. అందులో ఉన్న బంగారం మహిళ చూసుకొని అని వస్తువులు ఉన్నాయి తెలిపి పోలీసులకు, ఆటో డ్రైవర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా మరచిపోయిన బ్యాగ్‌ను అందజేసిన ఆటో డ్రైవర్‌ను 2 టౌన్ సీఐ ప్రత్యేకంగా అభినందించారు. సీఐతో పాటు రైటర్ విప్పర్ల వెంకట్రావు, మహిళా కానిస్టేబుల్ ఉన్నారు.

# మార్కాపురం డీఎస్పీగా యు నాగరాజు బాధ్యతలు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, సెప్టెంబర్ 16) మార్కాపురం డీఎస్పీగా యు. నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయం ప్రత్యేక పూజలు చేశారు.నిన్న జారీ అయిన ఉత్తర్వుల్లో ఆయనను మార్కాపురం సబ్ డివిజన్ డిఎస్పీగా ప్రభుత్వం కేటాయించింది. తొలుత పట్టణంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్లోని అన్ని మండలాల్లో ఎలాంటి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. డీఎస్పీని మర్యాదపూర్వంగా కలిసిన సిబ్బంది మార్కాపురం డీఎస్పీగా నూతన బాధ్యతలు చేపట్టిన యు. నాగరాజును మార్కాపురం సీఐతో పాటు పలువురు ఎస్సైలు మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చారు. సీఐ, ఎస్సైలతో డీఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే శాంతి భద్రతలను ఆయన అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రతి స్టేషన్‌ను సందర్శిస్తానని తెలిపారు.



# కార్పొరేట్ వైద్యసేవలు నెల్లూరులో ఏర్పాటు అభినందనీయం

## నెల్లూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, సెప్టెంబర్ 16) అనీస్, రాహెల్ ఇద్దరు ఎండీఎస్ పూర్తి చేసి దంత వైద్యంలో నైపుణ్యం పొంది ఉన్నారు. కార్పొరేట్ వైద్యశాలల్లో ఉండాల్సిన లేటెస్ట్ ఎక్విప్మెంట్ ను నెల్లూరుకు తెచ్చి నెల్లూరు ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని నెల్లూరు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ అన్నారు. నెల్లూరు నగరంలోని మినీ బైపాస్ రోడ్డులో గల జీపీఆర్ కళ్యాణమండపం వద్ద నూతనంగా ప్రారంభించిన డాక్టర్ అమీన్స్ నేషనల్ డెంటల్ హాస్పిటల్ ను సోమవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి నెల్లూరు ప్రజలకు సేవ చేయాలన్న ఆలోచనతో నూతన దంత వైద్యశాల ను ప్రారంభించారు. భార్యాభర్తలు అనీస్, రాహెల్ ఇద్దరూ ఎం.డీ.ఎస్ పూర్తి చేసి పలు రకాల దంత వైద్యాల్లో నైపుణ్యం పొంది ఉన్నారన్నారు. పెద్ద కార్పొరేట్ వైద్యశాలల్లో ఉండాల్సిన లేటెస్ట్ టెక్నాలజీ ఎక్విప్మెంట్స్ ను నెల్లూరు కు తీసుకొని వచ్చారన్నారు. నెల్లూరులో ఎక్కువగా దిగువ మధ్యతరగతి వారు ఉన్నారు. అటువంటి ప్రదేశాల్లో మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నానని చెప్పారు. ఒకటే కాక మరెన్నో బ్రాంచ్‌లు ప్రారంభించి ఉన్నత స్థాయికి రావాలని, నెల్లూరు ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఒంగోలులో ఘనంగా మిలాద్ ఉన్ నబీ పండుగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, సెప్టెంబర్ 16) మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగ వేడుకలను ఒంగోలులో ఘనంగా జరుపుకున్నారు. పండగను పురస్కరించుకొని నగరంలో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహిస్తూ పాత మార్కెట్ వద్ద గల దర్గా వద్దకు చేరుకున్నారు. ముస్లిం సోదరలకు జిల్లా ఎస్పీ ఏ. ఆర్ దామోదర్ స్వయంగా కొన్న స్వీట్‌లను రెండో పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు ఒకటో పట్టణ సీఐ వై నాగరాజులు పంపిణీ చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఎస్పీ మా పండగ సందర్భంగా స్వయంగా మిఠాయిలు పంచిన సందర్భంగా ముస్లిం సోదరులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు సాయం అందించిన క్రీస్తు సంఘం సభ్యులు



(షణ్ముఖ వెలుగు, పెద్దదోర్నాల, సెప్టెంబర్ 16) ఇటీవల కాలంలో వచ్చిన వరదలకు స్పందించి సోమవారం నాడు విజయవాడ నగరంలో ఉన్న వాంబే కాలనీ, వైయస్సార్ కాలనీ,క్రీస్తు సంఘముల సభ్యులకు దోర్నాల టౌన్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సువార్తికులు చాట్ల గంగయ్య,చాట్ల రాజు, సింగా రాజేష్,లు బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సువార్తికులు గొల్లపూడి జోషప్ మైకిల్, చాట్ల యిర్మీయా, చిలక కోటయ్య, పులుకూరి పెద్ద యోహాను, సంఘ పెద్దలు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com